రూ.2.34 కోట్లతో అభివృద్ధి పనులు

నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవం


మహత్ కాలనీలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు


అంబేడ్కర్ కాలనీలో నిర్మించిన కళావేదికపై కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ, నాయకులు

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ కాలనీలో రూ.19.95 లక్షలతో సామాజిక భవనం, మహత్ కాలనీలో రూ.18 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలో రూ.39 లక్షలతో నిర్మించిన కళావేదిక, విద్యానగర్‌లో రూ.19.95 లక్షలతో బీటీ రోడ్లు ,రాజీవ్‌నగర్‌లో రూ.18 లక్షలతో బీటీ రోడ్లు, గాంధీనగర్, ఈస్ట్ పార్కు ప్రాంతంలో రూ.39.74 లక్షలతో బీటీ రోడ్లు, కళింగనగర్‌లో రూ.19.20 లక్షలతో సీసీ రోడ్లు, వుడా కాలనీ ప్రాంతంలో రూ.98.41 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్లను కె.కె.రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మొత్తంగా రూ.2.34 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన వాటిని ఆయన ప్రారంభించి, పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం వైఎస్ ప్రెసిడెంట్ పేడాడ రమణికుమారి, డీఈ భరణి, ఏఈ రత్నాకర్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, దిడ్డి రమేష్, విశ్వనాథరాజు, రాజాం రాజు, బి.తిరుమలరావు, అంబటి శైలేష్, వై.వరలక్ష్మి, మెట్ట దమయంతి, శ్యామ్, రత్నం, పప్పల లక్ష్మణ్, పొన్నాడ అప్పారావు, రాజేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్

సీతంపేట: నియోజకవర్గంలోని 26, 27, 43, 44 వార్డుల పరిధిలో గల అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ పనులను శుక్రవారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ పరిశీలించారు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం, సెంటర్ మీడియన్, రోడ్డు నిర్మాణ పనులు, రోడ్ విస్తరణ మ్యాప్‌ను పరిశీలించి మాట్లాడారు. అక్కయ్యపాలెం హైవే నుంచి పాలబూత్ సెంటర్ వరకు జరుగుతున్న 80 అడుగుల రోడ్ విస్తరణ పనులను ఈ వారంలో పూర్తి చేస్తామన్నారు. విస్తరణలో అడ్డంకిగా ఉన్న టౌన్ ప్లానింగ్ పరిధిలోని సమస్యలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఈఈ మత్స్యరాజు, ఏసీపీ రామకృష్ణ, సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్‌ఎంసీ హైస్కూల్ విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్

సీతమ్మధార: రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు సీతమ్మధార పి అండ్ టి కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 15న గాజువాక ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిలో రాష్ట్రస్థాయికి ఐదు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఎన్‌ఎంసీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి పి.గణేష్ రోలింగ్ స్పీడ్ ప్రాజెక్టులో ఎంపిక కావడంతో డీఈవో చంద్రకళ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి గణేష్‌ను, పోటీల్లో పాల్గొన్న వారిని హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

అలరించిన గాత్ర కచేరి


లలితా పీఠంలో నవావరణ కృతులు ఆలపిస్తున్న గాయనీమణులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. లలితా చంద్రశేఖర్ శిష్యబృందం ముత్తుస్వామి దీక్షితులు వారి కమలాంబ నవావరణ కృతులు మృధుమధురంగా ఆలపించి వీనుల విందు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ కళాకారులను ఘనంగా సత్కరించారు.

'తెలగ'ను బీసీ జాబితాలో చేర్చాలి


అక్కయ్యపాలెంలో వెంకట రామారావుకు స్వాగతం పలుకుతున్న తెలగ కులస్తులు

సీతంపేట: ఉత్తరాంధ్రలోని తెలగ సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ కుల కన్వీనర్ పిన్నింట్ల వెంకట రామారావు కోరారు. ఈ డిమాండ్ సాధనకు ఇచ్ఛాపురం నుంచి నిర్విరామంగా చేస్తున్న పాదయాత్ర శుక్రవారం విశాఖ నగరంలోకి ప్రవేశించింది. ఎండాడ, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఆరిలోవ, నక్కవానిపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం ప్రాంతాల మీదుగా అక్కయ్యపాలెం చేరుకుంది. నగర తెలగ కుల సంఘాల ప్రతినిధులు అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ కూడలి వద్ద ఘన స్వాగతం పలికారు. జైజై తెలగ అంటు నినాదాలు చేస్తూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 20 రోజుల కిందట ఇచ్ఛాపురం నుంచి పాదయాత్ర చేపట్టానని, పాయకరావుపేటలో ముగిస్తానని చెప్పారు. 40 ఏళ్లుగా తెలగ కులస్తుల్లో ప్రతిభ ఉన్న ఉన్నత చదువులకు దూరంగా ఉన్నారని, ఆర్థికంగా వెనుకబడి ఆకలి బాధలతో జీవిస్తున్నారన్నారు. తెలగ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తెలగ కులస్తులంతా ఒక్క తాటిపైకి వచ్చి బీసీల్లో చేర్చాలనే డిమాండ్ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు తాటిచెట్టి సంతోష్‌కుమార్, పట్టెపు నాగేశ్వరరావు, మోగంటి రవి, సిద్ధాంతం అప్పారావు, వెంపలి ఆనంద్, అధిక సంఖ్యలో మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం


నూతన భవనంలో ధాన్ ఫౌండేషన్ సభ్యులతో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్‌లో స్థానిక కళాంజలి ధాన్ ఫౌండేషన్ సంస్థకు జీవీఎంసీ కేటాయించిన జీ ప్లస్ టు నూతన భవనాన్ని శుక్రవారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.49.50 లక్షలతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపా రు. వార్డులో రూ.25 కోట్లతో 80 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ధాన్ ఫౌండేషన్ సభ్యులు కటుమూరి సతీష్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజులకు ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ధాన్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ శైలజ, గ్రామాధ్యక్షుడు దూది నర్సింగరావు, ఎస్.అప్పారావు, ఆర్పీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 47 మంది ఎంపిక


అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. 07 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 555 ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 380 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 47 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

యువ చిత్రకారుడికి అభినందన


నటరాజన్ గుల్జార్‌కు ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న యువ చిత్రకారుడు సంఘవి

సీతమ్మధార: చిత్రకళలో నైపుణ్యం ఉండటం అదృష్టమని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి నటరాజన్ గుల్జార్ అన్నారు. పెన్సిల్, సృజనాత్మక చిత్రకళలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనకాపల్లికి చెందిన యువ చిత్రకారుడు ఆర్ట్ సంఘవిని ఆయన అభినందించారు. నగరంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యాలయంలో శుక్రవారం గుల్జార్‌ను సంఘవి కలిసి తాను గీసిన ఆయన చిత్రపటాన్ని బహూకరించాడు. ఈ సందర్భంగా గుల్జార్ మాట్లాడుతూ మన దేశ యువత ప్రతిభ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తోందన్నారు. యువతరాన్ని తల్లిదండ్రులతోపాటు విభిన్న స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రోత్సహించి, వారి ప్రతిభకు మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం పెన్సిల్ కళపై ఆసక్తితో ఏ గురువు లేకుండానే సృజనాత్మక చిత్రాలు రూపొందిస్తూ, ఆర్కిటెక్చర్ చదువుతున్న సంఘవి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఘనంగా రథసప్తమి పూజలు


గణేష్‌నగర్ ఆలయంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


గాంధీనగర్-2 హరిహర క్షేత్రంలో ఆదిత్యుడిని దర్శించుకుంటున్న మహిళలు

సీతమ్మధార: రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీత్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో సూర్యనారాయణ స్వామికి అర్చకుడు ఏడిద గురునాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి బి.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడికి అభిషేకాలు

మద్దిపాలెం: సూర్యనారాయణ స్వామికి రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. 51వ వార్డు గాంధీనగర్–2లో హరిహరక్షేత్రం శివాలయంలో కొలువైన ప్రత్యక్ష దైవం సూర్య జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి శుక్రవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆదిత్యుడికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

జీఆర్పీ అదుపులో గంజాయి నిందితుడు


గంజాయి నిందితుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 4.5 కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ వి.బాలాజీరావు సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేరళకు చెందిన షార్పాస్ అనే వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 4.5 కేజీల గంజాయిని గుర్తించారు. ఇతడి అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

ఆటో డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం చేసిన నూతన మోటార్ యాక్ట్ 106(1)(2) హిట్ అండ్ రన్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి డిమాండ్ చేసారు. ఈ మేరకు శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వాహన డ్రైవర్లను వేధించేలా ఉందని, వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వై.వెంకట్, ఎస్.చిన్నారెడ్డి, ఎం.ఎ.ఖాన్, ఎం.వి.ఎస్.కుమార్, వై.అప్పలరాజు, జి.రాంబాబు, పి.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో వాకింగ్ ట్రాక్ కళకళ


అక్కయ్యపాలెం బస్ షెల్టర్ వద్ద వాకింగ్ ట్రాక్‌లో గ్రీన్ మ్యాట్ గడ్డి పరుస్తున్న సిబ్బంది


మొక్కలతో కళకళలాడుతున్న వాకింగ్ ట్రాక్

సీతంపేట: ప్రజల వ్యాయామం కోసం అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు ఆరోగ్యంతోపాటు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జీవీఎంసీ 44వ వార్డు పరిధి హైవే పక్కన అక్కయ్యపాలెం బస్టాప్ వద్ద ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో సుమారు రూ.25 లక్షలతో ఇటీవల అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ప్రాంతంలో జీవీఎంసీ హార్టీకల్చర్ సిబ్బంది పూల మొక్కలు, గ్రీన్‌మ్యాట్ గడ్డి, ఆకర్షణీయమైన క్రోటన్స్ మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్‌లో నడిచే వారికి, ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసే వారికి ఆహ్లాదాన్ని ఇచ్చేలా పూల మొక్కలు, పచ్చదనంతో ట్రాక్‌ను అందగా తీర్చిదిద్దారు. దీంతో హైవేపై వెళ్తున్న వాహన చోదకులను వాకింగ్ ట్రాక్ కనువిందు చేస్తోంది.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించి వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా..

- టాటా–ఎర్నాకుళం(08189) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 26 తేదీల్లో తెల్లవారు 5.15 గంటలకు టాటాలో బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్య రాత్రి 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళంలో ఈ నెల 22, 29 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజాము 4.35 గంటలకు టాటా చేరుకుంటుంది.
- కన్యాకుమారి–డిబ్రూఘడ్(06103) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, మార్చి 1, 15, 29 తేదీల్లో (శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖ వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06104) స్పెషల్ ఈ నెల 21, మార్చి 6, 20, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.
- కన్యాకుమారి–డిబ్రూఘడ్(06105) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, మార్చి 8, 22, ఏప్రిల్ 5 తేదీల్లో(శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06106) స్పెషల్ ఈ నెల 28, మార్చి 13, 27, ఏప్రిల్ 10 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

పలు రైళ్ల రీషెడ్యూల్

ఆయా స్టేషన్ల నుంచి శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరిన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఈ రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

- శుక్రవారం ఉదయం 10 గంటలకు బయల్దేరవలసిన చెన్నై సెంట్రల్– భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరింది.
- శుక్రవారం ఉదయం 10 గంటలకు పురూలియాలో బయల్దేరవలసిన పురూలియా–విల్లుపురం(22605) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.
- శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయేల్దరవలసిన బెంగళూరు–అగర్తలా(12503) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్


మాట్లాడుతున్న క్రైం ఎస్ఐ ప్రకాష్

మద్దిపాలెం: ఇయర్‌బడ్స్ దొంగతనం కేసులో ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించగా.. మరో మైనర్‌ను జువైనల్ హోమ్‌కు అప్పగించినట్టు కంచరపాలెం ఐదో పట్టణ క్రైం ఎస్ఐ ఎన్.వి.ఎస్.ప్రకాష్ తెలిపారు. కంచరపాలెం క్రైం స్టేషన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కంచరపాలెం సూర్యనగర్‌లో నివసిస్తున్న పీతల ఆకాష్ మద్దిలపాలెం వద్ద ఓ డాటా సెంటర్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ వేకువజామున తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై వస్తూ ఊర్వశి వద్ద దిగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ మైనర్‌తోపాటు కంచరపాలెం సురేష్‌రాంనగర్‌కు చెందిన మాడెం రాకేష్, కప్పరాడ రాంజీ ఎస్టేట్‌కు చెందిన పాత్రేటి బన్ను అనే యువకులు ఆకాష్‌ను అడ్డుకుని బలవంతంగా అతడి జేబులు తనిఖీ చేశారు. డబ్బులు లేకపోవడంతో అతడి వద్ద ఉన్న ఇయర్‌బడ్స్‌ను లాక్కొని వెళ్లిపోయారు. హఠాత్ పరిణామంతో తేరుకున్న ఆకాష్ జరిగిన విషయాన్ని వాట్సాప్ ద్వారా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్ఐ ప్రకాష్ కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

108 రౌండ్లు.. 1,296 సూర్యనమస్కారాలు


ఆసనాలు వేయిస్తున్న యోగా మాస్టర్ వెంకట రమేష్


ఆక్సిజన్ టవర్స్‌లో యోగా చేస్తున్న నివాసులు

సీతమ్మధార: రథసప్తమి సందర్భంగా శుక్రవారం సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో యోగా మాస్టార్, ఉచిత యోగా సంస్థల వ్యవస్థాపకుడు వెంకటరమేష్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులతో 108 రౌండ్ల (1,296) సూర్యనమస్కారాలు చేయించి, ఆసనాలు వేయించారు. యోగాలో మెలకువలు నేర్పించారు. యోగా సాధనతో మరింత ఆరోగ్యంగా ఉండవచ్చని వెంకటరమేష్ తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు యోగా రాజు, ఓం యోగా సెంటర్ ప్రెసిడెంట్ శాంతారామ్, ఏయూ యోగా డైరెక్టర్ భానుకుమార్, ఆక్సిజన్ టవర్స్ జనరల్ సెక్రటరీ పూనూరు దేవరాజ్‌రెడ్డి, కాశీవిశ్వనాథ్, కె.శ్రీనివాసరావు, రవీంద్ర మేగపాటి, మాజీ వీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో యోగా సాధన చేస్తున్న మురళీనగర్ వాకర్స్ సభ్యులు

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో..

మురళీనగర్: వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు నిర్వహణ కమిటీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సంయుక్తంగా సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నిర్వాహకులు పార్కులోని వాకర్స్‌తో 108 సూర్యనమస్కార ఆసనాలను ఉత్సాహంగా వేయించారు. కార్యక్రమంలో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు, అత్యధిక సంఖ్యలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్


రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ హైస్కూల్‌లో శుక్రవారం బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ప్రారంభించారు. నిర్మల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పార్టీ 42వ వార్డు నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.